


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 18-7-2025

సంపుటి: 21 సంచిక: 99
పేజీలు: 8 వెల: రూ.1

- నరసన్నపేటలో హాల్‌మార్కు మాయాజాలం
- జీఎన్‌ఆర్‌లో ముద్రల్లేకుండానే అమ్మకాలు
- నాగరాజుకే అవగాహన లేదంటే.. కొనుగోలుదారుల పరిస్థితేంటి?
- బీఐఎస్ అధికారుల సోదాల్లో బండారం బట్టబయలు
- బంగారం అమ్మకాల్లో మతలబులు షరామామూలు





## టెస్టింగే నకిలీ...
# 'పేట' స్వర్ణానికి మకిలి!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

'బంగారం అమ్మితే పెద్దగా లాభాలుండవండీ.. తాత తండ్రుల నుంచి చేస్తున్నాం కాబట్టి నడపక తప్పదు'.. ఇదీ బంగారం కొనడానికి వెళ్లేవారికి తరచూ వినిపించే మాట. కానీ బంగారం వ్యాపారం చేస్తున్నవారు మాత్రం ఏడాదికో బ్రాంచి పెడుతూ స్థలాలు, పొలాలు, కార్లు, బంగ్లాలు కొనడం చేస్తుంటారు. వ్యాపారంలో పెద్ద మార్జిన్ లేనప్పుడు ఇవన్నీ ఎలా సాధ్యమనే ప్రశ్న ప్రతి సామాన్యుడిలోనూ ఉంటుంది. కానీ బంగారం కొనడం సగటు భారతీయుడి వ్యసనం. ఆ మాటకొస్తే ఒంటిపై అలంకరించుకున్న బంగారాన్ని బట్టే గౌరవ మర్యాదలు లభిస్తాయి. చివరకు ఆ గౌరవం కోసం బంగారంలాగే ఉండే వన్‌గ్రామ్ గోల్డ్ ధరించి ఫంక్షన్లకు వెళ్తున్న మహిళలను చూస్తున్నాం. అయితే

- మిగతా చివరి పేజీలో

## జనసేనలో 'మార్కెట్'
# జగడం!



- వైకాపా సన్నిహిత కుటుంబానికి అప్పనంగా పదవి
- అసంతృప్తితో రగిలిపోతున్న జనసైనికులు, వీర మహిళలు
- తొలి నుంచి కష్టపడిన వారికి అన్యాయం చేశారని విమర్శలు
- ఆందోళనలతో అధిష్టానానికి నిరసన తెలపాలని నిర్ణయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనసేన పార్టీలో చిచ్చు రేపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని నాలుగు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను గురువారం రాత్రి ప్రభుత్వం ప్రకటించింది. ఎన్డీయే కూటమి మధ్య పదవులు పంపకంలో భాగంగా శ్రీకాకుళం మార్కెట్ కమిటీని జనసేనకు కేటాయించి ఛైర్‌పర్సన్ పేరు ప్రకటించారు. జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీలకు అధ్యక్షులను ప్రకటించగా.. వాటిలో శ్రీకాకుళంతోసహా రెండు జనసేనకు, రెండు టీడీపీకి కేటాయించారు. అయితే ప్రస్తుతం జనసేనలో రేగిన మంటలకు ఈ కేటాయింపులు కారణం కాదు. ఏ పార్టీకి పదవి ఇచ్చినా కష్టపడి పనిచేసేవారికి ఇవ్వాలి గానీ.. వైకాపాతో అంటకాగుతున్నవారికి పదవులు ఇవ్వడం ఏమిటని జనసైనికులు, వీర మహిళలు ఆగ్రహంతో ప్రశ్నిస్తున్నారు. శ్రీకాకుళం మార్కెట్ కమిటీ అధ్యక్షురాలిగా నగరానికి చెందిన మామిడి విష్ణు సతీమణి దారపు జ్యోత్స్నను నియమించినట్లు గురువారం రాత్రి ప్రకటన వచ్చినప్పటి నుంచీ జనసేన గ్రూపుల్లో రాత్రి తెల్లవార్లూ వాట్సప్‌లో ఇదే చర్చ జరిగింది. చివరకు పార్టీ అధిష్టానానికి తమ అసంతృప్తి తెలియజేయడానికి శాంతియుత మార్గంలో పార్టీ కార్యాలయం ముందు శుక్రవారం బైఠాయించడానికి నిర్ణయించుకున్నారు. జనసేనకు చెందిన జ్యోత్స్నకు పదవిస్తే జనసైనికులే అడ్డు చెప్పడమేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### కష్టపడిన వారికి కాకుండా..

దారపు జ్యోత్స్న భర్త

- మిగతా చివరి పేజీలో






- విశాఖ రైల్వేస్టేషన్‌లో స్లీపింగ్ ప్యాడ్ల ఏర్పాటు
- తక్కువ ఛార్జీలకే ఏసీ, వైఫై సహా అన్ని సౌకర్యాలు
- ఈస్ట్‌కోస్ట్ జోన్‌లోనే తొలిసారి ఇక్కడ నిర్వహణ
- దూరప్రాంతాల ప్రయాణికులకు ఎంతో ఉపయోగం



## సరికొత్త అనుభూతి..
# క్యాప్సూల్ హోటల్‌లో వసతి!

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే వ్యవస్థల్లో ఒకటైన భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు ఆధునిక సంతరించుకోవడంతోపాటు ప్రయాణికుల అవసరాలను గుర్తించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ మన్ననలు అందుకుంటోంది. తద్వారా ఆదాయం కూడా పెంచుకుంటోంది. ఇప్పటికే రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ తదితర పథకాల కింద ఆధునీకకరిస్తున్న రైల్వేశాఖ టికెట్ల విక్రయాలు కార్గో రవాణా ద్వారానే కాకుండా ఇతరత్రా సౌకర్యాలు కల్పించి.. దానికి ప్రతిఫలంగా కొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు అన్వేషిస్తోంది. ఎప్పటికప్పుడు ఆచరణలో పెడుతోంది. అలాంటి ఆలోచనకు ఆచరణ రూపమే క్యాప్సుల్ హోటళ్ల ఏర్పాటు. దూరప్రాంత ప్రయాణికులకు, కనెక్టింగ్ రైళ్ల కోసం ఎదురు చూసేవారికి అందుబాటు ధరలో రైల్వేస్టేషన్ల ఆవరణలోనే సకల సౌకర్యాలతో వసతి సౌకర్యం కల్పించేవే ఈ హోటళ్లు. అటువంటి క్యాప్సూల్ హోటల్ విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఇటీవలే అందుబాటులోకి వచ్చింది. తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలో ఇదే మొదటి క్యాప్సూల్ హోటల్ కావడం విశేషం.

### జపాన్ వ్యవస్థ ఇక్కడ అమల్లోకి

రైల్వే ప్రయాణికుల కోసం జపాన్‌లో ఇటువంటి వ్యవస్థను తొలుత అమల్లోకి తీసుకొచ్చారు. తర్వాత పలు ఇతర దేశాల్లోనూ క్యాప్సూల్ హోటళ్లు అమల్లోకి వచ్చాయి. వాటి నుంచి స్ఫూర్తి పొందిన ఇండియన్ రైల్వే అధికారులు అటువంటి వసతిని భారత రైల్వే స్టేషన్లలో కల్పిస్తే బాగుంటుందని యోచించి అమల్లో పెట్టారు. స్లీపింగ్ ప్యాడ్స్ అని కూడా వ్యవహరించే ఈ క్యాప్సూల్ హోటళ్లను ఇప్పటివరకు ముంబై, హైదరాబాద్ స్టేషన్లలోనే ఏర్పాటు చేశారు. తాజాగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు ఈ జోన్ పరిధిలో అత్యధికంగా ప్రయాణికులు రాకపోకలు సాగించే విశాఖ రైల్వేస్టేషన్‌లో ఈ సౌకార్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ మేరకు విశాఖ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం మొదటి అంతస్తులో దీన్ని ఏర్పాటు చేశారు.

### తక్కువ ధరకే అధునాతన సౌకర్యాలతో

సాధారణంగా రకరకాలు పనుల మీద, తీర్థయాత్రలకు, విహార యాత్రలకు వెళ్లే ప్రయాణికులు సంబంధిత రైల్వేస్టేషన్‌లో దిగిన వెంటనే ఎదురయ్యే మొదటి సమస్య వసతి. పరిచయం లేని, తెలిసినవారు లేని ఊరి కాని ఊళ్లలో లాడ్జింగులు, స్టార్ హోటళ్లను ఆశ్రయించక తప్పని పరిస్థితి. అయితే వీటిలో గదులు అద్దెలు ఏమాత్రం అందుబాటులో ఉండవు. కనీసం రోజువారీ అద్దె కనీసం రూ.500 నుంచి మొదలవుతుంది. కొంతమంది రైలు మారే క్రమంలో కనెక్టింగ్ రైళ్ల కోసం లేదా తాము ఎక్కాల్సిన రైలు ఆలస్యమైతే గంటల తరబడి స్టేషన్లలోనే వేచి ఉండాల్సి వస్తుంది. స్టేషన్లలో ఉండే డార్మెటరీలు, వెయిటింగ్ హాల్స్ ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. కాలకృత్యాలు వంటివి తీర్చుకోవడం కూడా కష్టమే. వాటి కోసం బయట లాడ్జింగులకు వెళ్దామంటే.. రోజువారీ అద్దె తప్ప గంటలవారీగా అద్దెకు రూములు ఇవ్వరు. ఫలితంగా ఈ తరహా ప్రయాణికులు చేతిచమురు వదిలించుకోవాలి లేదా కష్టమైనా రైల్వే స్టేషన్లలోనే కాలక్షేపం చేయాలి. సరిగ్గా ఇటువంటి వారి కోసమే రైల్వే శాఖ క్యాప్సూల్ హోటళ్లు లేదా స్లీపింగ్ ప్యాడ్లను అందుబాటులోకి తెచ్చింది. రైల్వేస్టేషన్లలో అన్ని రకాల ధరలు గుభేల్‌మనిపిస్తాయి. కానీ క్యాప్సూల్ హోటల్లో మాత్రం రూము ఛార్జీలు చాలా తక్కువగా ఉండటం విశేషం. మూడు గంటల కాలానికి సింగిల్ బెడ్ ఛార్జీ రూ.200గా నిర్ణయించారు. అదే సింగిల్ రూముకు 24 గంటలకు అంటే ఒక రోజుకైతే రూ.400 వసూలు చేస్తారు. డబుల్ బెడ్ తీసుకుంటే బూడు గంటలకు రూ.300, 24 గంటలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. మహిళలకు ప్రత్యేకంగా బెడ్స్ కేటాయించారు. ఏసీ, వైఫై, వేడి నీరు వంటి సౌకర్యాలతో పాటు సౌకర్యంగా కూర్చొని టీవీ చూసేందుకు సోఫాలు కూడా ఏర్పాటు చేశారు.

### రైలు బోగీలో ఉన్నట్లే..

తక్కువ స్థలంలో సౌకర్యవంతంగా స్లీపింగ్ ప్యాడ్లను ఏర్పాటు చేశారు. అచ్చం రైలు బోగీలో ఉన్నట్లే ఇక్కడ స్లీపింగ్ ప్యాడ్లు అమర్చారు. ఒకే వరుసలో, అలాగే ఎదురెదురుగా పైన, కింద బెర్త్‌లు ఏర్పాటు చేశారు. దేనికి దానికి కర్టెన్లు కూడా ఉండటం వల్ల ప్రైవసీకి ఇబ్బంది ఉండదు. విశాఖ క్యాప్సూల్ హోటల్లో ఏసీ సౌకర్యంతో కూడిన సింగిల్ బెడ్ ప్యాడ్స్ 73, డబుల్ బెడ్ ప్యాడ్స్ 15 ఉన్నాయి. మహిళల కోసం 18 బెడ్‌లు ప్రత్యేకంగా కేటాయించారు. ఉచిత వైఫై సౌకర్యంతోపాటు విశ్రాంతి తీసుకునేవారి కోసం స్నాక్స్ కూడా అందుబాటులో ఉంటాయి. ఆధునిక వాష్‌రూముతోపాటు విశాఖపట్నం ప్రయాణికులు, పర్యాటకులకు అవసరమైన సమాచారం అందజేసే హెల్ప్ డెస్క్ కూడా అందుబాటులో ఉంది.

• ఎడిటోరియల్


## భారత్‌పై సుంకాలు.. నాటో చీఫ్ వాచాలత!

సర్వసత్తాక సార్వభౌమాధికార దేశాన్ని ఎటువంటి అధికారాలు, అర్హతలు లేని ఒక అధికారి సుంకాల సుత్తితో మోదుతానని, ఆర్థిక ఆంక్షలు విధిస్తానని హెచ్చరించడాన్ని మితిమీరిన అహంకారంగానే పరిగణించాల్సి ఉంటుంది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు చేసుకుంటున్న భారత్‌పై అక్కసుతో ఉన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇచ్చిన వత్తాసో లేక ధనిక దేశాల కూటమికి అధిపతినన్న మిడిసిపాటుతోనో గానీ నార్త్ అట్లాంటిక్ ట్రియటీ ఆర్గనైజేషన్ (నాటో) సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే రెచ్చిపోయారు. రష్యాతో ముడిచమురు కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసుకోకపోతే భారత్‌పై వంద శాతం సుంకాలు విధిస్తామని ఆయన హెచ్చరించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అంతర్జాతీయ నిబంధనలను పాటిస్తూ అన్ని దేశాలతో మైత్రి కొనసాగిస్తున్న అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను ఈ విధంగా హెచ్చరించడం విస్మయం కలిగిస్తోంది. కొన్ని దేశాలకే పరిమితమైన ఒక సైనిక కూటమికి ఒక సార్వభౌమ, గణతంత్ర దేశాన్ని హెచ్చరించే ధైర్యం అయనకు ఎక్కడి నుంచి వచ్చిందన్న ప్రశ్న వినిపిస్తోంది. నాటో సభ్య దేశాలతో భారత దౌత్య సంబంధాలు దెబ్బతీసేంత దుస్సాహసానికి నాటో చీఫ్ తెగించడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. భారత వాణిజ్య విధానాలను ప్రశ్నించే అధికారం నాటోకు గానీ, దానికి చీఫ్‌కు గానీ అస్సలు లేదని అంతర్జాతీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఉత్తర అట్లాంటిక్ ఖండంలోని కొన్ని దేశాల సైనిక కూటమి మాత్రమే అయిన ఈ సంస్థకు అంతర్జాతీయ వాణిజ్య సమీక్ష అధికారం కూడా లేదని అంటున్నారు. సార్వభౌమాధికార, స్వతంత్ర దేశంగా తాను ఎవరితో వాణిజ్య చేయాలన్నది నిర్ణయించుకునే స్వేచ్ఛ, హక్కు భారత్‌కు ఉంది. ఇందులో వేలు పెట్టే అర్హత నాటోతో సహా ఎవరికీ ఉండదు. కానీ నాటో తన పరిధి దాటి ప్రవర్తిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అమెరికా విదేశాంగ విధానాలకు నాటో తలొగ్గిందనేది బహిరంగ రహస్యం. మరోవైపు చైనా, భారత్ సారథ్యంలో పటిష్టమవుతున్న బ్రిక్స్ కూటమి అంతర్జాతీయ మారకమైన డాలర్ ఆధిపత్యానికి గండికొట్టి ప్రత్యామ్నాయ కరెన్సీని ముందుకు తేవొచ్చనే భయాందోళనలు అమెరికాను వెంటాడుతున్నాయి. అందుకే నాటోతో హెచ్చరికలు చేయిస్తోందని భావిస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్య విభేదాలు తలెత్తితే పరిష్కరించేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) ఉండనే ఉంది. ఇప్పుడు దాని విధుల్లోకి నాటో తలదూర్చడం ఏమిటన్న విమర్శలు మొదలయ్యాయి. శాంతి కాముక దేశంగా పేరొందిన భారత్‌కు ఉక్రెయిన్-రష్యా యుద్ధం విషయంలో నాటో వంటి సైనిక కూటమి నుంచి శాంతి ప్రభోదాలు వినాల్సిన అవసరం లేదని అంతర్జాతీయ దౌత్య నిపుణులు చెబుతున్నారు. ఏ దేశమైనా తమ ఇంధన అవసరాలకు తగ్గట్లు విదేశాంగ, వాణిజ్య విధానాలు అవలంభిస్తుంది. అటువంటప్పుడు రష్యా లేదా ఫలానా దేశం నుంచి ముడిచమురు, సహజవాయువు కొనడానికి వీల్లేదని భారత్‌తో సహా ఏ దేశాన్నయినా అడ్డుచెప్పే అధికారం నాటోకు లేదు. మరి నాటో చీఫ్ ఇలా ఎందుకు చేశారన్న ప్రశ్నకు నాటో సభ్య దేశాల నుంచి సమాధానం లేదు. రష్యా, అమెరికా సహా పశ్చిమాసియా, ఆఫ్రికా వరకు వేర్వేరు ఖండాల్లోని దేశాల నుంచి భారత్ ముడి చమురు దిగుమతి చేసుకుంటోంది. భారత ఇంధన భద్రత విషయంలో వేలుపెట్టే అధికారం ఏ దేశానికీ లేదు. భారత్ గనక నాటో హెచ్చరికలను సీరియస్‌గా తీసుకుంటే ఆ కూటమి సభ్య దేశాలతో, అలాగే అమెరికాతో దౌత్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇవేవీ ఆలోచించకుండా అమెరికా ప్రయోజనాలను కాపాడే డమ్మీ వాణిజ్య విభాగం స్థాయికి నాటో పడిపోయింది. పలు యూరోపియన్ దేశాలు కూడా ఇప్పటికీ రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నప్పటికీ, వాటిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై భారత్ ఇంకా పూర్తిస్థాయిలో స్పందించనప్పటికీ.. భారత అంతర్గత వ్యవహారాల్లో నాటో చీఫ్ జోక్యం చేసుకోవడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని విదేశాంగ శాఖ వర్గాలు స్పష్టం చేశాయి. నాటో ఏ విధంగా భారత్‌పై ఆంక్షలు, సుంకాలు విధిస్తుందని ప్రశ్నిస్తూ.. దానికి ఆస్కారమే లేదంటన్నారు. రష్యాతో చమురు బంధం రద్దు చేసుకోకపోతే భారత్, చైనా, బ్రెజిల్ దేశాలపై 500 శాతం సుంకాలు విధిస్తామని ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇది జరిగిన రెండు రోజులకే నాటో సెక్రటరీ జనరల్ వంద శాతం సుంకాలు అంటూ రెచ్చిపోయారు. దీన్ని భారత్ తీవ్రంగా పరిగణించాలని పలువురు సూచిస్తున్నారు.

## కిల్లిపాలేంలో ఉచిత వైద్యశిబిరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మండలంలోని రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిల్లిపాలేం గ్రామంలో ఉచిత వైద్య శిబిరంను శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి.చిరంజీవి నాయుడు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈసందర్భంగా రోగులకు పరీక్షించి మందులు అందించాలన్నారు. అనంతరం మాట్లాడుతూ జ్వరాలు, డయేరియా వంటి అంటువ్యాధులు వ్యాప్తి చెందే సీజన్ కాబట్టి తప్పకుండా కాచి చల్లార్చిన మంచినీరు త్రాగాలని సూచించారు. అదే విధంగా తరచూ సబ్బుతో చేతులు కడుక్కోవాలని, దోమకాటుకి గురి కాకుండా నియంత్రణ చర్యలైన వర్షపు నీటి నిల్వలు లేకుండా చేయడం, ఇంటి పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, పాడైన టైర్లు, రిఫ్రిజిరేటర్ వెనుక భాగంలో వుండే నీటి నిలువలు తొలగించడం, ప్రతి శుక్రవారం పొడి దినం పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు ఆరోగ్య విద్యను అందించారు. కార్యక్రమంలో స్త్రీ ఆరోగ్య పర్యవేక్షకులు యస్.ఈశ్వరమ్మ, తవిటమ్మ ఏఎన్ఎమ్ చంద్రమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, ఆశా కార్యకర్తలు కుమారి, రామలక్ష్మి పాల్గొన్నారు.




## ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ సమస్యకు పరిష్కారమార్గం చూపిస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం స్థానిక విశాఖ కోలనీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార, ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సంప్రదించి, సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వము ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తుందని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, రూరల్, గార, కళింగపట్నం, పరిసర గ్రామ ప్రజలు, టీడీపీ నగరనాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్చార్జ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా

## కొన్న శ్రీనివాస్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



అఖిల భారత యువ జన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లాకు చెందిన కొన్న శ్రీనివాస్ నియమితులయ్యారు. ఒంగోలు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కొన్న శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కమ్యూనిస్టు భావజాలంతో యువకుల హక్కుల కోసం, నిరుద్యోగ యువత కోసం పోరాడి యువజన సంఘంలో కీలకంగా వ్యవహరించారు. కొన్న శ్రీనివాస్ ఎన్నిక పట్ల జిల్లాలో పలు విద్యార్థి, యువజన, కమ్యూనిస్టు నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యువజన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ ఎన్నిక పట్ల ఏఐవైఎఫ్ శ్రీకాకుళం జిల్లా సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


## బేస్‌బాల్ పోటీల్లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పట్టణంలో గల ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆడంగి రాజమోహిని రాష్ట్రస్థాయిలో జరిగిన ఏడవ సీనియర్ బేస్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈనెల 12, 13, 14 వ తేదీల్లో శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలో జరిగిన ఏడవ బేస్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 9 మంది బృందం కలిగిన శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ తొమ్మిది మంది బృందంలో ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన రాజమోహిని ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సనపల శ్రీనివాసరావు, సీఈవో ఎంఎస్ఎస్ గుప్తా, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ శైలజ తదితరులు అభినందించారు.



## మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జెమ్స్ హాస్పిటల్ ఆధర్యంలో డాక్టర్ మోహన రావు(క్లినిక్) సహకారంతో ఇకనుంచి ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్త్రీలకు ఉచితంగా డాక్టర్ వై.భవ్యశ్రీ వైద్యం అందిస్తారని జెమ్స్ మదర్ అండ్ చైల్డ్ ఎగ్జిక్యూటివ్ వెంకుమహంతి లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం స్థానికంగా వచ్చిన మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే వైద్యశిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని డాక్టర్ మోహనరావు, వెంకుమహంతి లక్ష్మణరావు కోరారు.

## జాతీయ ఉపాధ్యక్షునికి నియామకపత్రం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం జిల్లాకి చెందిన రౌతు శంకర రావుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈమేరకు గురువారం విజయవాడ తుమ్మల కళాసమితిలో జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘ మహాసభలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లాక వెంగలరావు యాదవ్, జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్స రాజ్ గంగారం అహిర్ చేతులు మీదగా నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా శంకరరావుకు వారితో పాటు శ్రీకాకుళం జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను సంఘం నిబంధనల మేరకు త్రికరణ శుద్ధితో పని చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రాష్ట్రాల, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



## మీరు హీరోలు కాదు.. దేవుళ్లు!!

సెలబ్రిటీలు ఏదో ఒక సామాజిక సేవ చేస్తూనే ఉంటారు. పేదల కోసం, పిల్లల కోసం తమకు తోచిన సాయం చేస్తూనే ఉంటారు. కొందరు ఉచితంగా వైద్యం అందిస్తుంటే..మరి కొందరు ఉచితంగా విద్య, ఆహారం కూడా అందిస్తుంటారు. ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ఆపదలో ఉన్న అనేకమందిని ఆదుకున్నారు. అయితే తాజాగా ఓ ప్రముఖ హీరో కొందరు పేదలకు చేసిన సాయం ఇప్పుడు అంతటా హాట్‌టాపిక్‌గా మారింది. అతనెవరో కాదు.. తమిళ నటుడు సూర్య. సూర్య మరోసారి తన మంచిమనసు చాటుకున్నాడు. తాను నటిస్తున్న సినిమా కోసం వేసిన సెట్‌ను పేదలకు ఇచ్చేశాడు. షూటింగ్ కోసం నిర్మించిన ఇళ్లను పేద మత్స్యకారులకు ఉచితంగా అందించాలని సూర్య నిర్ణయం తీసుకున్నారు.

బాల దర్శకత్వంలో సూర్య నటిస్తున్న చిత్రం షూటింగ్ ప్రస్తుతం కన్యాకుమారిలో జరుగుతోంది. షూటింగ్ కోసం జాలర్లు నివసించే గుడిసెల తరహాలోనే భారీ ఖర్చుతో ఇళ్లను నిర్మించారు. అయితే అక్కడ ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యాక వాటిని కూల్చివేయకుండా ఇళ్లు లేని నిరుపేద మత్స్యకారులకు ఇవ్వాలని సూర్య నిర్ణయించారు. ఎంతో శ్రమతో ఖర్చుతో నిర్మించిన ఇళ్లను షూటింగ్ అనంతరం కూలచేయకుండా వాటిలో కొన్ని కుటుంబాలకు అయినా నీడ కల్పించాలనే సూర్య అనుకున్నారు. దీంతో సూర్య చేసిన ఈ ఆలోచనను, ఆశయాన్ని ఆయన అభిమానులు, ఆ ప్రాంతంలోని ప్రజలు అభినందిస్తున్నారు. సూర్యపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇటీవలే సూపర్ హిట్ అయిన సూర్య సినిమా జైభీమ్ గురించి కూడా అందరికీ తెలిసిందే. ఈ సినిమా సమయంలో కూడా సూర్య తన గొప్ప మనసు చాటుకున్నాడు. జై భీమ్ సినిమాతో అందరికీ తెలిసిన రియల్ సినతల్లి అమ్మాళ్‌కు సూర్య సాయం చేశాడు. అమ్మాళ్ పేరు హీరో సూర్య రూ.10 లక్షలను బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసాడు. అంతే కాకుండా దాని నుంచి వచ్చే నెల వారి వడ్డీని అమ్మాళ్‌కు అందేలా సూర్య చూశాడు. అయితే ఈ అమ్మాళ్ జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా జై భీమ్ అనే సినిమా తెరకెక్కింది. మరోవైపు మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ కూడా తన మంచి మనసును చాటుకున్నారు. పేద విద్యార్థులకు ఆయన అండగా నిలిచారు. మోహన్‌లాల్ 20మంది పేద విద్యార్థుల చదువుకు అయ్యే ఖర్చును భరించేందుకు ముందుకొచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఫేస్‌బుక్‌లో వెల్లడించారు. విశ్వశాంతి ఫౌండేషన్ సహకారంతో అట్టపాడికి చెందిన గిరిజన బాలలను ఎంపిక చేసి 15ఏళ్ల పాటు వారిని చదివించనున్నట్లు మోహన్‌లాల్ తెలిపారు. దీంతో మోహన్‌లాల్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



మోనికకు వాళ్లిద్దరు

## అంత గొప్ప వీరాభిమానులా?

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తోన్న 'కూలీ' రిలీజ్‌కు రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. దీంతో సోషల్ మీడియాలో ప్రచారం కూడా మొదలైంది. లిరికల్ సింగిల్స్ రిలీజ్ అవుతున్నాయి. తాజాగా ఇటీవలే పూజాహెగ్డేపై చిత్రీకరించిన "మోనిక" అంటూ సాగే ఐటం పాటను రిలీజ్ చేసారు. మాస్ నెంబర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. రెడ్ కలర్ ఔట్ ఫిట్‌లో అందాల భామ పూజా స్టెప్ అందుకుంటే? కుర్రాళ్ల గుండెల్లో సలపరం మొదలవుతుంది. ఈ పాటలో పూజా హెగ్డే ఎనర్జీ మామూలుగా లేదు. గ్లామరస్, రెట్రో-స్టైల్ డ్యాన్స్ మూవ్స్‌తో పూజా ఆకట్టుకుంది. పాటలో పూజాహెగ్డే పాత్ర పేరు మోనిక. మరి ఇంతకీ ఎవరీ మోనికా అంటే? మోనికా బెల్లూచికి ఒక ఇటాలీయన్ నటి. మంచి డాన్సర్ కూడా. మోనికా బెల్లూచీకి అనిదరుర్, లోకేష్ కనగరాజ్‌లు వీరాభిమానులట. తొలుత ఈపాట మోనికా బెల్లూచీ పూర్తి పేరు మీదే ఉండాలనుకున్నారుట. కానీ తర్వాత పూజా హెగ్డే మోనికగా మార్చినట్లు లోకేష్ తెలిపాడు.

చిన్ననాటి నుంచి ఆమెను ఆరాధించేవాడినని మోనిక నటించిన 'మాలేనా' సినిమా అప్పట్లో టీనేజర్స్ అందరికీ హాట్ ఫెవరెట్ గా తెలిపాడు. హాలీవుడ్ కంటెంట్ యాక్సెస్ ఉన్న ప్రతీ ఒక్కరికీ ఈ సినిమా గురించి తెలిసే ఉంటుంది. ఇప్పుడిదే పేరుతో పూజాహెగ్డే కి లోకేష్ క్యారెక్టర్ రాయడం అంటే లోకేష్ ఆ బ్యూటీకి ఎంతగా కనెక్ట్ అయ్యాడో అద్దం పడుతుంది. మొత్తానికి లోకేష్ కనగరాజ్ అభిమానించే గ్రేట్ పెర్ఫార్మర్ కూడా ఒకరున్నారని ఈసందర్భంగా బయట పడింది. లోకేష్ గొప్ప క్రియేటర్ మాత్రమే కాదు అంతకు మించి మంచి నటీమణుల విషయంలో మంచి అభిరు చిగల దర్శకుడిగానూ ప్రూవ్ అవుతున్నాడు. మాస్ తో పాటు వెస్ట్రన్ బీట్స్ అందిండచడంలో అనిరుద్ దిట్ట. తనదైన మార్క్ మాస్ కు వెస్ట్రన్ జోడించాడంటే ఆ పాటకు తిరుగుండదు. మోనిక పాట నెట్టింట వైరల్ గా మారిన సంగతి తెలిసిందే.



- తుపాకి.కామ్ సౌజన్యంతో...




# హిందీ పెద్దమ్మ ఎక్కడ? కనబడుట లేదు!!



**మా ఇంటిపక్కన భవననిర్మాణంలో పనిచేసే బీహార్‌కి చెందిన కూలి వాళ్లు ఇక్కడి వాళ్లతో హిందీలో మాట్లాడతారు. కానీ, వాళ్లలో వాళ్లు మాట్లాడుకునేది మాత్రం హిందీ కాదు, వేరే భాష, వాళ్ల మాతృభాష. హిందీ తేలిగ్గా అర్థమయ్యే ఎవరికైనా ఆ భాష అస్సలు అర్థం కాదు. మా ఇంటి చుట్టుపక్కల రాజస్థాన్‌కి చెందిన చాలా మార్వాడి కిరాణా షాపులున్నాయి. వాళ్లంతా కస్టమర్లతో హిందీలోనే మాట్లాడతారు. కానీ వాళ్ల కుటుంబ సభ్యులతో, వాళ్ల ప్రాంతం వారితో మాట్లాడేది హిందీ కాదు. వేరే భాష. అది మనకు అర్థం కాదు. మరి వీళ్లంతా హిందీ బెల్ట్ అని చెప్పుకునే ప్రాంతాల నుంచి వచ్చినవారే కదా? వీళ్లు హిందీలోనే కదా మాట్లాడాలి. మరి వీళ్లు హిందీలో కాకుండా వేరే భాషలో ఎందుకు మాట్లాడుకుంటున్నారు? ఎందుకంటే.. హిందీ భాష, హిందీ రాష్ట్రాలు, హిందీ ప్రజలు.. మొత్తంగా హిందీ బెల్ట్ అనేది కేవలం కొందరు రాజకీయ లబ్ధి కోసం ఆయా ప్రాంతాల ప్రజల మీద నిర్దాక్షిణ్యంగా కప్పిన కృత్రిమ తొడుగు. అదే హిందీ గొడుగు. హిందీ రాష్ట్రమైన మహారాష్ట్రలోనే హిందీకి వ్యతిరేకంగా పోరాడుతుంటే.. ఏ విషయంలోనూ ఏమాత్రం అవగాహన లేని పవన్ కల్యాణ్ మాత్రం హిందీ లేకపోతే భవిష్యత్తే లేదనీ, హిందీ పెద్దమ్మ అనీ ఏవేవో మాట్లాడుతున్నారు. ఆ మాటలకు విలువివ్వాల్సిన అవసరం లేకపోయినా జెండా కూలీల బానిసత్వం, అజ్ఞానాన్ని దృష్టిలో పెటుకుని ఆ భయంతో అయినా స్పందించక తప్పని దుస్థితి ఏపీలో దాపురించింది. ఏం చేస్తాం.. రాయి విసిరేది పిచ్చోడే అయినా తిప్పికొట్టక తప్పదు. దీనికి తోడు ఈ 'తండ్రీ కొడుకులు' బీజేపీ మెప్పు కోసం హిందీని జాతీయభాష చేసేశారు. జాతీయ భాష హోదా దేవుడెరుగు, అసలు హిందీ భాషకు ప్రాంతీయ హోదా అయినా ఉందా అనేది పెద్ద ప్రశ్న! నిజంగా హిందీ మాతృభాషగా ఉండి, హిందీ మాట్లాడేవాళ్లు ఈ దేశంలో ఎంత మంది? 'దక్షిణ భారతదేశంలో సరే గానీ మహారాష్ట్రలో హిందీకి వ్యతిరేకత ఏంటి?' ఆశ్చర్యంగా అన్నాడు నా ఫ్రెండ్ మొన్నాధ్య ఓసారి. చాలా మంది ఇదే తప్పుడు అభిప్రాయంతో ఉంటారు. దక్షిణ భారతీయులు మాత్రమే హిందీ భాషా వ్యతిరేకులు అనుకుంటారు. నిజానికి దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరాది రాష్ట్రాలే హిందీ వల్ల ఎక్కువగా నష్టపోయాయి. తమ మాతృభాషల్ని, సంస్కృతీ సంప్రదాయాల్ని తద్వారా తమ అస్తిత్వాలనే కోల్పోయే ప్రమాదంలో పడిపోవడంతో తమ భాషల్ని బతికించుకోవాలనే ఆకాంక్షతో పాటు దానికి అడ్డుపడుతున్న హిందీ పట్ల వ్యతిరేకత ఉత్తరాది ప్రజల్లో (మీడియా కవర్ చేయకపోయినా) తీవ్రస్థాయిలోనే ఉంది.**

### హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో మాట్లాడేది హిందీయేనా?

రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్, ఢిల్లీ, హర్యానా, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్.. ఈ పది రాష్ట్రాలను హిందీ బెల్ట్‌గా పిలుస్తున్నాం. భారతదేశమనేది భిన్న సంస్కృతులతో భిన్న భాషలతో మిళితమై ఉంది. 'కోస్ కోస్ పర్ బద్లే పానీ, చార్ కోస్ పర్ వాణి' – (ప్రతీ కోసు దూరానికీ నీటిలో మార్పు, ప్రతీ నాలుగు కోసులకూ భాషలో మార్పు) అని హిందీలో ప్రసిద్ధ నానుడి. మరి పశ్చిమాన రాజస్థాన్ నుంచి తూర్పున బీహార్ వరకు ఉత్తరాన హిమాచల్ నుంచి దక్షిణాన చత్తీస్‌గఢ్ వరకూ కొన్ని వేల కిలోమీటర్లు ఒకే భాష హిందీ భాష ఉండడం ఎలా సాధ్యం!

### అవన్నీ మాండలికాలేనా?

అవన్నీ హిందీ భాష మాండలికాలని కొందరు బుకాయించ వచ్చు. తెలుగు భాషకూ మాండలికాలున్నాయి. ఉత్తరాంధ్ర, కోస్తా, తెలంగాణ, రాయలసీమ మాండలికాల్లో ఎంత తేడా ఉన్నా, కొన్ని పదాలు అర్థం కాకపోవచ్చు కానీ తెలుగు తెలిసిన ఎవరికైనా మాండలిక భాష అర్థమవుతుంది. కానీ హిందీ భాషలో పండితులైనవారికి కూడా హిందీ బెల్ట్‌లోని ప్రజలు మాట్లాడే మగధి, అవధి, భోజ్‌పురి, బ్రజ్, బుందేలి, బగేలి, భౌలి, కాంగ్డీ, గఢ్వాలి, హరియాన్వీ, మార్వాడి, మాల్వీ, చత్తీస్ గఢి, కనౌజి, కడిబోలి, కొట్ట, పహాడి, మైథిలి వంటి అనేక భాషల్లో ఒక్కటి కూడా అర్థం కాదు. ఎందుకంటే ఈ భాషలన్నీ హిందీ మాండలికాలు కావు. దేనికది ప్రత్యేకమైన భాష. ఇలాంటి 56 మాతృభాషల్ని హిందీ గొడుగు కింద హిందీలో కలిపేసుకుని ఆయా భాషలు మాట్లాడేవారిని హిందీ ప్రజలుగా ముద్ర వేసేశారు. భారతదేశ ప్రజలు మాట్లాడే మాతృభాషలు 2వేలకు పైగా ఉన్నాయి. అత్యధిక ప్రజలు మాట్లాడే అనేక మాతృభాషలు కూడా గుర్తింపునకు నోచుకోలేక హిందీ ముసుగు, ముద్రలు వేసుకున్నాయి. ఈ ముసుగు తీస్తే నిజంగా హిందీ మాతృభాషగా ఉన్న ప్రజలు ఈ దేశంలో ఎంతమంది??

### 2011 జనాభా లెక్కల ప్రకారం 44 శాతం భారతీయుల మాతృభాష హిందీ

1961 జనాభా లెక్కల సమయంలో హిందీ బెల్ట్‌లో 10 మాతృభాషల్ని హిందీలో కలిపి దేశ జనాభాలో హిందీ ప్రజల శాతాన్ని 30.39 శాతానికి తీసుకొస్తే, 1971 జనాభా లెక్కల్లో మరికొన్ని భాషల్ని కలిపి 37 శాతానికి తెచ్చారు. 1991లో ఇంకొన్ని భాషల్ని మింగి హిందీ ప్రజల్ని 39.29 శాతానికి తెస్తే 2001లో మరిన్ని భాషల్ని



ఆక్రమించి 41.11 శాతం, 2011లో 56 మాతృభాషల్ని అణచి హిందీ ప్రజల్ని 44 శాతానికి చేర్చారు. ఇప్పటికి 15 ఏళ్లయింది. రాబోయే జనాభా లెక్కల్లో హిందీ ఇంకెన్ని భాషల్ని మింగనుందో, దేశంలో హిందీ ప్రజల శాతం ఇంకెంత పెరగనుందో! కేంద్ర నాయకుల మాయాజాలమే ఈ కృత్రిమ పెంపు.

### 2011 జనాభా లెక్కల ప్రకారం చూసినా..

పెద్ద రాష్ట్రమైన రాజస్థాన్‌లో 37 శాతం మంది రాజస్థానీ భాష మాట్లాడితే.. హిందీ మాట్లాడేది 26 శాతం మాత్రమే. ఇతరుల మాతృభాష మార్వాడి, మాల్వీ, జయ్‌పూరి మొదలైనవి. హిమాచల్ ప్రదేశ్‌లో 32 శాతం మంది పహాడీ, 36 శాతం మంది కాంగ్డీ, గఢ్వాలి భాషలు మాట్లాడితే.. హిందీ మాట్లాడే ప్రజలు కేవలం 15 శాతం. ఛత్తీస్‌గఢ్‌లో 62 శాతం ప్రజలు ఛత్తీస్‌గఢీ మాట్లాడితే.. హిందీ మాట్లాడే ప్రజలు కేవలం 10 శాతమే. జార్ఖండ్‌లో 60 శాతం పైగా ప్రజల మాతృభాష కొట్టా. బీహార్‌లో భోజపూరి, మైథిలి, మగధి లాంటి అధిక సంఖ్యాకులు మాట్లాడుకునే భాషలతో పాటు 146 అల్పసంఖ్యాకుల మాతృ భాషలు ఉనికిలో ఉన్నాయి. ఆ రాష్ట్రంలో హిందీ మాతృభాష 10 శాతం కంటే తక్కువ. ఉత్తరాఖండ్ ప్రజలు మాట్లాడే భాషల్లో మొదటి 5 జాబితాలో హిందీ అసలు లేనే లేదు!

2011 జనాభా లెక్కల ప్రకారం భోజ్‌పూరి మాట్లాడే ప్రజలు 5 కోట్లకు పైగా ఉన్నారు. రాజస్థానీ మాట్లాడేవారు 2.5 కోట్ల పైగా, ఛత్తీస్‌గఢీ 1.5 కోట్ల పైగా ఉంటే హర్యాన్వీ మాట్లాడే ప్రజల సంఖ్య కోటికి పైగా ఉంది. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం ప్రకారం దేశంలో భోజ్‌పూరి మాట్లాడేవారి సంఖ్య 15 కోట్ల పైగానే ఉంటుంది. ఉత్తరప్రదేశ్‌లో 7 కోట్లు, బీహార్‌లో 8 కోట్లు. వీరికి చిత్ర పరిశ్రమ కూడా ఉంది. భోజ్‌పూరి భాషలో అనేక సినిమాలు రూపు దిద్దుకున్నాయి. దేశంలో అధిక సంఖ్యాక ప్రజలు మాట్లాడే భాషల జాబితాలో భోజ్‌పూరి కచ్చితంగా 2 లేదా 3 స్థానాల్లో ఉంటుంది. అయినప్పటికీ ఈ భాషకు గుర్తింపు లేదు. ఈ భాషలకు అధికారిక గుర్తింపు లేకపోవడంతో జనాభా లెక్కల్లో వీరి మాతృభాష హిందీ అయి కూర్చుంది. వీళ్లంతా హిందీ వాళ్లు అయిపోయారు. హిందీ బెల్ట్ ముసుగులో.. వందల ఏళ్లుగా ప్రజల నాలుకలపై సజీవంగా ఉన్న అనేక భాషలకు నిన్నగాక మొన్న పుట్టిన హిందీ మాండలిక ముసుగు వేసుకునే ఖర్మ పట్టింది.

### హిందీ ఎప్పుడు.. ఎలా పుట్టింది?

వైదిక సంస్కృతం నుంచి సౌరసేని ప్రాకృత భాషలు పుట్టాయి. కడిబోలి, కనౌజి, పర్యాన్వీ, బ్రజ్ లాంటి అనేక ఉత్తరాధి భాషలకు ఈ ప్రాకృత భాషే మూలం. 1206లో ఢిల్లీ సుల్తాన్లు అధికారం చేపట్టేనాటికి ప్రాకృత భాష నుంచి పుట్టిన కడిబోలి భాష ఢిల్లీ ప్రజల మాతృభాషగా ఉండేది. సుల్తాన్లు పర్షన్ భాషను అధికారిక భాషగా ప్రకటించుకుని పాలన సాగించడంతో ఈ కడిబోలి భాష పర్షన్‌తో కలిపి ఒక కొత్త భాష పుట్టింది. దాన్నే హిందుస్థాని అన్నారు. 1526లో బాబర్ రాకతో మొగల్ సామ్రాజ్యంలో ఈ హిందుస్థానీ మరింత ఎక్కువగా పర్షన్ ప్రభావానికి లోనై ఉర్దూ భాషకు జన్మనిచ్చింది.

18వ శతాబ్ధంలో బ్రిటిష్ వారు పర్షన్ భాషను తొలగించి ఢిల్లీ స్థానికులు అధికంగా మాట్లాడే ఉర్దూని స్థానిక అధికారిక భాషగా ప్రకటించారు. ఉర్దూ భాష అరబ్ లిపిని అనుసరించడంతో మతపరమైన సమస్యలు తలెత్తాయి. దాన్ని ముస్లిం భాషగా పరిగణించి హిందూ పెద్దలు తమ కోసం ప్రత్యేక భాష కావాలనే ఉద్దేశంతో హిందుస్థానీలో మరింత సంస్కృతాన్ని చొప్పించి కొత్త భాషను అభివృద్ధి చేశారు. అదే హిందీ. దీనికీ ఉర్దూకీ పెద్దగా తేడాలేకపోయినా దేవనాగరి లిపిని అనుసరించడం వల్ల హిందువుల భాషగా ప్రచారం చేశారు.

## ఆ సాహిత్య సంపద హిందీ సొంతమా?

ఇప్పటికీ హిందీ భాష వయసు మూడు శతాబ్దాలకు మించి లేదు. మగధి, భోజ్‌పూరి, బ్రజ్, బగేలీ, హరియాన్వీ, మైథిలి లాంటి హిందీ కంటే భిన్నంగా ఉండే అనేక భాషలు హిందీ కంటే చాలా పురాతనమైనవి. సాహిత్య సంపద కలిగిన భాషలు.

తులసీ దాస్ రాసిన రామ్‌చరితమానస్, హనుమాన్ చాలీసాలు అవధి భాషలో ఉన్నాయని ఎంతమందికి తెలుసు? సూర్‌దాస్, రహీమ్ దోహేలు బ్రజ్ భాషలో.. మీరాబాయి రచనలు రాజస్థానీ భాషలో.. కబీర్‌దాస్ దోహేలు అవధి, బ్రజ్, భోజ్‌పూరి భాషల్లో.. 12వ శతాబ్దపు ప్రసిద్ధ కవి ఆలాఖండ్ బుందేలీ, బగేలీ భాషల్లో రాశారు. అయినా ఈ సాహిత్యం అంతా హిందీ సాహిత్యంగా మోసపూరిత ప్రచారం జరుగుతూనే ఉంది. ఈ భాషలకు లిపి లేకపోవడం వల్ల అవి గుర్తింపు పొందలేకపోతున్నాయని కొందరు అంటుంటారు. మరి హిందీకి కూడా లిపి లేదు. ఈ అన్ని భాషలూ ఉపయోగించే దేవనాగరినే హిందీ కూడా అనుసరిస్తుంది. నిజానికి మొదట్లో చాలా భాషల రచనలు వాటి ప్రత్యేక లిపిలోనే జరిగాయి. మైథిలి భాష రచనలు తొలిదశలో దేర్వోతియా మితిలాక్షర్ అనే స్క్రిప్ట్‌లో ఉండేవి. భోజ్‌పూరికి కైతీ స్క్రిప్ట్, రాజస్థానీ, మార్వాడీకి మహాజనీ స్క్రిప్ట్, పహాడీ భాషకు టాకరీ స్క్రిప్ట్.. ఇలా ప్రత్యేకంగా ఉండేవి. తరతరాలుగా వాటిని భద్రపరుచుకోవడంలో, ముందు తరాలకు నేర్పించడంలో జరిగిన నిర్లక్ష్యం కారణంగా ఆ రాతలు అంతరించిపోయాయి. నేడు అన్నిటికీ దేవనాగరి లిపే గతయ్యింది. హిందీ ఆధిపత్యానికి తలొగ్గే పరిస్థితి దాపురించింది.

### ఎనలేని ప్రాచుర్యం ఎందుకొచ్చింది?

కొందరికి రాజకీయ, సాంఘిక, సామాజిక ఆధిపత్య ధోరణి ప్రదర్శించడానికి హిందీ భాషాధిపత్యం కూడా అవసరమయింది. దీంతో జయ్ శంకర్ ప్రసాద్, మహాదేవి వర్మ, సుమిత్రానందన్, మైథిలీ శరణ్ గుప్త వంటి ఎందరో సాహితీవేత్తలు హిందీని గొప్ప భాషగా కీర్తిస్తూ రచనలు సాగించారు. హిందీకి ఎనలేని ప్రాచుర్యం తెచ్చిపెట్టడంలో నార్త్ ఇండియా మీడియా, బాలీవుడ్ సినిమా పరిశ్రమ ప్రధాన పాత్ర పోషించాయి. 90 దశకంలో వచ్చిన రామాయణ్, మహాభారత్ వంటి టీవీ సీరియల్స్ హిందీని ఇంటింటికీ చేర్చాయి. గత 75 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం హిందీయేతర రాష్ట్రాల్లో హిందీని బలవంతంగా రుద్దడానికి వేల కోట్లు ఖర్చు చేస్తూనే ఉంది. ఇప్పుడు బీజేపీ అధికార ఛత్రఛాయలో హిందీ భాషాధిపత్యం మళ్లీ పుంజుకుంది. ప్రస్తుతం 70 శాతం పైగా క్యాబినెట్ పత్రాలు హిందీలోనే ఉంటున్నాయి. ఉప రాష్ట్రపతే ఏకంగా హిందీని జాతీయ భాష అని అసత్య భాషణలు చేస్తారు. సెంట్రల్ యూనివర్శిటీల శాలరీ స్లిప్స్‌లో పేర్లు హిందీలోనే ఉంటున్నాయి. కేవలం మూడు సంవత్సరాల్లో హిందీ టీచర్ల కోసం 349 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. విచిత్రమైన విషయమేంటంటే.. దేశంలో హిందీ భాషకు ఏమాత్రం ఆదరణ లేని 1881 సంవత్సరంలోనే పెద్ద రాష్ట్రమైన బీహార్‌లో హిందీని అధికార భాషగా ప్రకటించారు. అప్పుడు ఆ రాష్ట్ర ప్రజల్లో 99 శాతం మందికి హిందీ రాదు, ఆ భాష అర్థం కూడా కాదు. క్రమంగా హిందీని ప్రస్తుతం చెప్పుకునే హిందీ బెల్ట్ రాష్ట్రాల్లోకి బలవంతంగా చొప్పించారు. ఇంకా హిందీని క్లాసిక్ భాషగా, పండితుల, అక్షరాస్యుల భాషగా కీర్తిస్తూ, స్థానికుల మాతృభాషల్ని నిరక్షరాస్యుల భాషగా అవహేళన చేస్తూ వస్తున్నారు. హిందీ నేర్చుకోకపోతే ఉత్తర భారతదేశంలో ఏ పనీ దొరకని పరిస్థితులు కల్పించారు.

### స్వాతంత్ర్యానికి ముందే ప్రయత్నాలు

హిందీని జాతీయభాషగా గుర్తించాలని స్వాతంత్ర్యానికి ముందు నుంచి కూడా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. విభిన్న సంస్కృతుల, భాషల ప్రజలు నివసించే ఈ దేశంలో అన్ని భాషలకూ సమాన గుర్తింపు గాక ఏదో ఒక భాషను అందలం ఎక్కించి దాని కనుసన్నల్లో మిగతావి మెలగాలంటే? ఈ ఆధిపత్య ధోరణి దేశ ఐక్యతను దెబ్బతీస్తుందన్న విషయం ఈ దేశ పాలకులకు 1962లోనే చాలా బాగా తెలిసొచ్చింది. స్వాతంత్ర్యానంతరం హిందీతో పాటు ఇంగ్లీష్‌ను కూడా 15 ఏళ్ల పాటు అధికార భాషగా ప్రకటించారు. ఈలోపు దేశ ప్రజలందరి మీదా బలవంతంగా అయినా హిందీ రుద్దేసి (నేర్పించి) హిందీని జాతీయభాషగా ప్రకటించాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. 15 ఏళ్లు గడిచాక 1962లో మళ్లీ ఇంగ్లీష్‌ని తొలగించి హిందీని జాతీయభాషగా వివాదాస్పదమైన ప్రతిపాదన తెరపైకి వచ్చేసింది. దీంతో దక్షిణ భారతీయులే కాదు దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వెల్లువెత్తేసరికి అప్పటి హోంమంత్రి లాల్ బహద్దూర్ శాస్త్రి జాతీయభాష అనే భావన పక్కపెట్టి, దేశ ప్రజలు హిందీని అమోదించనంత వరకూ హిందీ, ఇంగ్లీష్ రెండూ అధికార భాషలుగా కొనసాగేలా 1963లో చట్టం తీసుకొచ్చారు.

### పోరాటాలతో అధికార భాషా హోదాలు

1951లో రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూల్‌లో కేవలం 14 భాషలనే అధికారికంగా గుర్తించారు. తర్వాతి కాలంలో తమ భాషను నాశనం చేస్తున్న హిందీ ఆధిపత్యాన్ని భరించలేని అనేక భాషల వాళ్లు తీవ్రస్థాయిలో పోరాటాలు సాగించారు, ఇంకా సాగిస్తూనే ఉన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే రాజ్యాంగంలోని 21వ సవరణలో కొన్ని భాషలకూ, 71వ సవరణలో కొన్ని భాషలకూ, 92వ సవరణలో దశాబ్దాల పోరాటం తర్వాత మైథిలీ భాషకూ, మరో నాలుగు భాషలకూ ఎట్టకేలకు 2003లో అధికార హోదా, గుర్తింపు లభించింది. దాంతో ప్రస్తుతం ఈ దేశంలో గుర్తింపు పొందిన భాషల సంఖ్య 22కి చేరుకుంది. ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్ర భాష మైథిలీ. పాలకుల స్వార్థం, రాజకీయ లెక్కలు ఎంత దారుణంగా ఉంటాయంటే.. జార్ఖండ్‌లో గుర్తింపు పొందిన మైథిలీ భాషకు బీహార్‌లో మాత్రం గుర్తింపు లేదు. అక్కడి లక్షల సంఖ్యలో ఈ భాష మాట్లాడుతున్నప్పటికీ.. బీహార్‌లో మైథిలీని అధికారికంగా గుర్తిస్తే అంతకంటే ఎక్కువ కోట్ల సంఖ్యలో ప్రజలు మాట్లాడే భోజ్‌పురి, మగధి భాషలను కూడా గుర్తించాల్సి ఉంటుంది. మైథిలీ లాంటి భాషల విజయంతో భోజ్‌పూరి, మగధి, రాజస్థానీ, ఛత్తీస్‌గఢి లాంటి మరికొన్ని భాషలు హిందీ నుంచి తమ ఉనికిని కాపాడుకోవడం కోసం తీవ్రస్థాయిలో పోరాటం చేస్తున్నాయి. ఈ పోరాటంలో 39 మాతృభాషలున్నాయి. తమ భాషను 8వ షెడ్యూల్లో కచ్చితంగా చేర్చాలన్న డిమాండ్ ఉత్తర భారత రాష్ట్రాల్లో పెద్దఎత్తున వినిపిస్తోంది. ఇదే జరిగితే ఆయా ప్రజల్ని ఆ భాషా ప్రజలుగానే గుర్తిస్తారు. అప్పుడు హిందీ ప్రజలుగా మిగిలేది ఎవరు? రాబోయే ఈ ప్రమాదాన్ని పసిగట్టిన హిందీ ఉద్ధారకుల, సంరక్షకుల ప్రొఫెసర్ గ్రూప్ ఒకటి ఇటీవల ప్రధాని మోడీకి ఒక లేఖ రాసింది. భోజ్‌పురి, రాజస్థానీ, ఛత్తీస్‌గఢీ, హర్యాన్వీ లాంటి అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తించవద్దని, 8వ షెడ్యూల్లో కలపవద్దని ఆ లేఖ సారాంశం. ఈ భాషల్ని గుర్తిస్తే లెక్కల్లో చూపించే హిందీ ప్రజల సంఖ్య తారుమారవుతుందని ఈ ప్రొఫెసర్ గుంపు చెబితే కానీ తెలుసుకోలేనంత అమాయకులు కాదుగా బీజేపీ నాయకులు! పాపం పహాడీ భాషల్లో స్వల్ప సంఖ్యాకులు మాట్లాడే అనేక గిరిజన భాషలున్నాయి. హిందీ ఆధిపత్యాన్ని ఎదిరించి నిలబడే శక్తి లేని, తమ ఉనికి కోసం పోరాటాలు సాగించలేని ఈ భాషలన్నీ అత్యంత ప్రమాదంలో పడిపోయాయి. రాబోయే 50 ఏళ్లలో హిందీ ఆధిపత్యానికి సుమారు 400 భాషలు అంతరించిపోయే ప్రమాదం కనిపిస్తోంది.

### ఏపీ పాలకుల తీరు ఇదీ..

ఉత్తర భారత భాషలతో సంబంధం లేకుండా తమ కంటూ భిన్నమైన అస్తిత్వం, ప్రాచీన స్థాయి సాహిత్యాలున్న ద్రవిడ భాషలపైన కూడా నిన్నగాక మొన్న పుట్టిన హిందీ పెత్తనాన్ని సహించలేని ఇక్కడి రాష్ట్రాలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ పాలకులు మాత్రం స్వలాభం కోసం, కేంద్ర మెప్పుకోసం తెలుగు భాషను ప్రమాదంలోకి నెడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి మరీ హిందీకి స్వాగతం పలుగుతున్నారు. ఈ ధోరణిని తెలుగు ప్రజలు గుర్తించి వ్యతిరేకించకపోతే, తిరస్కరించకపోతే అది మన మాతృభాషకు మనం చేసుకున్న ద్రోహమే అవుతుంది.

### చివరిగా..

హిందీని వ్యతిరేకించే పంజాబ్ రాష్ట్రం, త్రిభాషా పద్ధతిని అనుసరించక తప్పని పరిస్థితుల్లో ఇంగ్లీష్, పంజాబీ తర్వాత మూడో భాషగా తెలుగుని చేర్చింది. ఇది కూడా ఘోరమైన తప్పిదమే. పరాయి భాషలు ఇష్టంతో ఎవరైనా ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. బలవంతంగా పిల్లల మీద రుద్ది తప్పనిసరిగా నేర్చుకోవలసిన పరిస్థితి కల్పించడం మాత్రం అన్యాయం. పంజాబ్ స్కూళ్లలో తెలుగు నేర్పించే టీచర్లకు కూడా తెలుగు రాదు యూట్యూబ్‌ల నుంచి మొదట వాళ్లు నేర్చుకుని దాన్ని పిల్లలకు నేర్పిస్తున్నారు. ఉచ్చారణ దోషాలే కాదు, ఒక రకంగా చెప్పాలంటే వారి చేతుల్లో తెలుగుభాష ఖూనీ అవుతోంది. కొంతకాలానికి తెలుగు భాష పట్ల పంజాబీ విద్యార్థులకు విరక్తి పుట్టొచ్చు. ఈ దుస్థితికి ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా తప్పు పట్టలేము. అక్కడ హిందీ టీచర్లు దొరికినట్టు తెలుగు టీచర్లు దొరకరు కదా. త్రిభాష అంటే హిందీనే అవసరం లేదు ఏ భారతీయ భాష అయినా నేర్చుకోవచ్చు అని వృథ మాటలు చెప్పే వారికి బాగా తెలుసు హిందీయేతర రాష్ట్రాల్లో మూడో భాషగా హిందీనే గతి అవుతుందని. అందుకే తమిళనాడు ప్రభుత్వం చాలా తెలివిగా తమ భాష మీద ఎవరి పెత్తనాన్నీ ఆమోదించని ద్విభాషా విధానమే అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలూ ఈ త్రిభాషా విధానాన్ని తిరస్కరించి తమ మాతృభాషకు పెద్ద పీట వేయకపోతే.. 'పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికినట్టు' హిందీ మెల్లమెల్లగా మీ భాషను మింగేసి తన ఆధిపత్యాన్ని చాటుకుంటుంది.

- ది వైర్ సౌజన్యంతో..



# ఏఎంసీ చైర్మన్‌ను పునఃపరిశీలించండి

### కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన జనసైనికులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించిన దారపు జ్యోత్స్న పేరును పునఃపరిశీలించాలని కోరుతూ జనసైనికులు పార్టీ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ సీనియర్ నాయకుడు గురుప్రసాద్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతోమంది పార్టీ కోసం పని చేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు పార్టీ ఫిరాయించిన వారికి ఈ పదవి కట్టబెట్టడం పట్ల బాధపడుతున్నామన్నారు. పవన్ కల్యాణ్ అభిమానులను జనసైనికులుగా మార్చడం కోసం అహర్నిశలు పని చేసిన వారు అనేకమంది ఉన్నారని, అందులో ఎవరికి ఈ పదవి ఇచ్చినా బాగుండేదని, అలా కాకుండా పార్టీ కోసం ఏమాత్రం పని చేయనివారికి పదవి ఇవ్వడం వల్ల తప్పుడు సంకేతాలు వెళ్తాయన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పేరును పునఃపరిశీలించాలని, కష్టపడిన జనసైనికులను గుర్తించాలనే ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కొండా ఉదయ్ శంకర్, వెంకీ, కామేష్, సాయి, నవీన్, కొర్లయ్య, కిరణ్, మధు, కాంత్, అర్జున్, సతీష్, శేఖర్, శ్రీను, రాములు తోపాటు వీరమహిళలు విష్ణుప్రియ, లక్ష్మి కూడా పాల్గొన్నారు.

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

# జనసేనలో ‘మార్కెట్’ జగడం!





(మొదటిపేజీ తరువాయి)

మామిడి విష్ణు గత ఎన్నికలకు దాదాపు రెండు నెలల ముందు వరకు వైకాపాలో కొనసాగారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, అప్పట్లో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న మామిడి శ్రీకాంత్‌కు ప్రధాన అనుచరుడిగా వ్యవహరించారు. 2024లో వైకాపా అధికారంలోకి రాదనే వాతావరణం కనిపించడంతో చివరి నిమిషంలో ఆయన వైకాపా నుంచి జనసేనలోకి ఫిరాయించారు. పోనీ చేరిన తర్వాతైనా కూటమి అభ్యర్థి ప్రచారంలో గానీ పోల్ మేనేజ్‌మెంట్‌లో గానీ పాల్గొన్నారా? అంటే.. అదీ లేదని జన సైనికులు చెబుతున్నారు. ఇక మామిడి విష్ణు భార్య జ్యోత్స్న రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటారని, కేవలం కులం కార్డుతోనే పదవులి వ్వడం సరికాదని జనసేన వీరమహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పవన్ కల్యాణ్ పురుష అభిమానులతో నిండిపోయిన జనసేన పార్టీలో వీరమహిళల పేరుతో మహిళలు చేరడమే అరుదు. అటువంటి చోట పార్టీ పెట్టిన దగ్గర్నుంచి కష్టపడి పని చేస్తున్న కొందరి పేర్లను స్థానిక నాయకత్వం అధిష్టానానికి సూచించింది. ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న విష్ణు




ప్రియాంక ఇందులో ముందువరుసలో ఉన్నారు. 2016 నుంచి జనసేనలో యాక్టివ్‌గా పని చేస్తున్నారు. ఆ తర్వాత మోహన్ లక్ష్మి, కాదంటే దమ్మల ఓవీధికి చెందిన జనసైనికుడు ఉదయ్ భార్య పేరును పరిశీలించాలని కోరారు. అయితే వీటన్నింటికీ భిన్నంగా దారపు జ్యోత్స్నను ఎంపిక చేశారు.

### అస్త్రాలు సిద్ధం చేస్తున్న అసంతృప్తవాదులు

వీరు ఎప్పుడూ పార్టీ కోసం పని చేయలేదు సరికదా.. మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టినరోజుకు మామిడి విష్ణు గ్రీటింగ్స్ చెబుతూ 2024లో దిగిన ఫొటోలను తన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారని పార్టీ అధిష్టానానికి చెప్పడానికి జన సైనికులంతా ఆధారాలు సిద్ధం చేశారు. 2024 జూన్ 5న ఎన్నికల ఫలితాలు వస్తే దానికి 15 రోజుల ముందు మే 21న ధర్మాన ప్రసాదరావుకు గ్రీటింగ్స్ చెబుతూ తీసుకున్న ఫొటో ఫేస్‌బుక్‌లో కనిపిస్తుంది. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు మామిడి విష్ణు పార్టీలోకి వస్తే.. జనసేనలో చేరిన తర్వాత కూడా వైకాపా అభ్యర్థి, మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావుకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఫొటో సోషల్ మీడియాలో కనిపించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాజాం మార్కెట్ కమిటీ చైర్మన్ విషయంలో కూడా పార్టీతో సంబంధం లేని వ్యక్తులకు ఇవ్వడంతో జనసేన నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోస్టింగ్‌ను ఆపేశారు. మరో వైపు హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కూడా జనసేనకే కేటాయించగా, అది కూడా కాపు సామాజికవర్గానికి చెందిన మామిడి రామకృష్ణారావుకు కేటాయించడం కొసమెరుపు.

# టెస్టింగే నకిలీ.. ‘పేట’ స్వర్ణానికి మకిలి!




(మొదటిపేజీ తరువాయి)

బలిసినవారు కొనుగోలు చేసిన బంగారం కూడా వన్ గ్రామ్ గోల్డ్‌కు ఎక్కువ, కేడీఎం బంగారానికి తక్కువ అన్నట్టు ఉంది. కావాలంటే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు ఇచ్చిన స్టేట్‌మెంట్ పరిశీలించాలి.

### కొన్నింటిపై భోగస్ మార్క్.. కొన్నింటిపై అదీ లేకుండానే..

రసన్నపేట కేంద్రంగా గుడ్ల నాగరాజు షాపు (జీఎన్‌ఆర్)లో కేజీకి పైగా బంగారు ఆభరణాలు సీజ్ చేశారు. ఎందుకయ్యా.. అంటే వాటి మీద బోగస్ హాల్‌మార్క్, బీఐఎస్ ముద్ర ఉందని, అలాగే హెచ్‌యూ ఐడీ నెంబరు లేని బంగారం ఉందని అధికారులు మీడియాకు తెలిపారు. హాల్‌మార్క్ లేకుండా 1072.45 గ్రాముల బంగారు ఆభరణాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు బీఐఎస్ అధికారులు గుర్తించారు. అయితే ఇది తమ తప్పు కాదని, స్థానిక హాల్‌మార్క్ సెంటర్ చేసిన తప్పిదమని బంగారం షాపు యజమాని గుడ్ల నాగరాజు చెప్పుకొచ్చారు. నిజమే.. హాల్‌మార్క్ ముద్రించే శ్రీ లక్ష్మీ హాల్‌మార్క్ కేంద్రానిదే తప్పు.. కాదనడంలేదు. మరి ఎటువంటి హాల్‌మార్క్ లేకుండా జీఎన్‌ఆర్ షోరూమ్‌లో దొరికిన బంగారం సంగతి ఏమిటి? సాధారణంగా పట్టణాలే కాదు గ్రామాల నుంచి పట్టణాలకు బంగారం కొనుగోలుకు వచ్చేవారికి అసలు బీఐఎస్ ఏమిటి? హాల్‌మార్క్ ఏమిటి? హెచ్‌యూఐడీ ఏమిటి? అనేవి తెలియవు. నరసన్నపేటలో బంగారు ఆభరణాల మీద




ప్రభుత్వం నిర్దేశించిన బీఐఎస్, హాల్‌మార్క్/ హెచ్‌యూ ఐడీ మార్క్ వేయడానికి నాలుగు సెంటర్లు ఉన్నాయి. వీటిలో కాకుండా బుడితి నేతింటి గోవిందరాజులుకు చెందిన శ్రీలక్ష్మీ గోల్డ్ టెస్టింగ్ అండ్ హాల్ మార్కింగ్ సెంటర్‌లోనే తన బంగారు ఆభరణాలకు గుడ్ల నాగరాజు ఎందుకు బీఐఎస్ ముద్ర వేయించారన్నదే ఇప్పుడు తేలాల్సిన ప్రశ్న.

### వేరే వారి నెంబర్లతో హాల్‌మార్క్

నేతింటి గోవిందరాజులు, సింహాచలం పార్టనర్లుగా ఉన్న ఈ గోల్డ్ టెస్టింగ్ సెంటర్‌కు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవు. బీఐఎస్ లైసెన్స్ పొందడానికి అవసరమైన ఇతర నిబంధనలను కాసేపు పక్కన పెట్టినా.. బంగారం, వెండి నాణ్యతను పరీక్షించే మిషనరీ విలువే కోటి రూపాయల వరకు ఉంటుంది. పోనీ స్థానిక లేదా చైనా మిషనరీ సమకూర్చుకోవాలన్నా కనీసం రూ.60 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. ఇవేవీ లేకుండానే బంగారం షాపులు తెచ్చే నగలకు హాల్‌మార్క్ ముద్ర వేసి ఇచ్చేస్తుండటాన్ని బీఐఎస్ అధికారులు తమ సోదాల్లో గుర్తించారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కొత్త విధానం వల్ల ఆభరణం మీద ఉన్న హెచ్‌యూఐడీ నెంబర్‌ను గూగుల్‌లో టైప్ చేస్తే అసలు అందులో ఎంత బంగారం ఉంది? ఎక్కడ హాల్‌మార్క్ వేశారు? వంటి వివరాలన్నీ వచ్చేస్తాయి. దీన్నే ఆసరా చేసుకుని నెట్‌లో ఉన్న వేరే వారి హెచ్‌యూఐడీ నెంబర్లు వేసి గుడ్ల నాగరాజు పంపించిన బంగారు ఆభరణాలకు హాల్‌మార్క్ వేసే పంపించేసేవారు. ఇవన్నీ ఫేక్. నాగరాజు ఎంత చెబితే అంతమేరకు బీఐఎస్, హాల్ మార్క్‌లు ముద్రించడం వల్ల అధికారుల తనిఖీలో ఇవి బయటపడిపోయాయి.

### అనుమతులు లేవని తెలియని అమాయకుడట!

శ్రీకాకుళంలో రెండు గోల్డ్ హాల్‌మార్క్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఒకదాంట్లో కొన్నాళ్లు పని చేసిన గోవిందరావు తనకు మొత్తం పని వచ్చేసిందంటూ మరో పార్టనర్‌ను కలుపుకొని నరసన్నపేటలో హాల్‌మార్క్ సెంటర్ ప్రారంభించారు. గుడ్ల నాగరాజు షాపులో పెద్ద మొత్తంలో వ్యాపారం జరుగుతుండటం గమనించి ఆయన్ను కస్టమర్‌గా పట్టుకున్నారు. లక్ష్మీ హాల్‌మార్క్ సెంటర్‌కు లైసెన్స్ ఉందో లేదో నాగరాజుకు తెలియక పోవచ్చు. కానీ తెలుసుకోవాల్సిన బాధ్యత ఆయనదే. కానీ దాన్ని విస్మరించి అందరికంటే చౌకగా ముద్ర వేస్తున్నాడని చెప్పి మొత్తం ఆభరణాలను ఆయన చేతిలో పెట్టి బీఐఎస్ అధికారులకు దొరికిపోయారు. లక్ష్మీ టెస్టింగ్ సెంటర్‌కు అనుమతులు లేని విషయం తమకు తెలియదని నాగరాజు బీఐఎస్ అధికారులకు చెప్పుకొచ్చారు. కానీ ఇదే జీఎన్‌ఆర్ షాపులో ఎటువంటి హాల్‌మార్క్ లేని ఆభరణాలను కూడా అధికారులు గుర్తించారు. జోగిపేటలో నిర్వహిస్తున్న షాపులో వీటిని సీజ్ చేస్తున్నట్టు యజమానికి నోటీసు ఇచ్చామని అధికారులు పేర్కొన్నారు. నకిలీ హాల్‌మార్క్, హెచ్‌యూ ఐడీతో బంగారం ఆభరణాలు అమ్మడం ఒక నేరమైతే, అసలు ఎటువంటి హాల్‌మార్కూ లేకుండా విక్రయిస్తుం డటం మరో నేరం. గ్రాము బంగారంలో 8 శాతం కాపర్(రాగి) పోను 92 శాతం బంగారం ఆభరణంలో ఉండాలి. రెండు గ్రాముల లోపు ఆభరణాలకు హాల్‌మార్క్ అవసరంలేదని నిబంధనలు చెబుతున్నాయి. అసలు 92 శాతం బంగారం ఉందో లేదో.. ప్రతి జాయింట్ వద్దా చెక్ చేసి బీఐఎస్ హాల్‌మార్క్ ఇవ్వాలి. కానీ టెస్టింగ్ సెంటరే నకిలీది కావడంతో షాపు యజమాని కోరుకున్నట్లు బీఐఎస్ హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ ముద్రలు వేసి ఇచ్చేశారు. అసలు బంగారమే పెద్ద మోసం. 916 కేడీఎం బంగారం అంటూ కొనుగోలు దారులకు చెబుతారు. దాన్ని తిరిగి అమ్మినప్పుడు ఆ బంగారానికి 100 శాతం రేటు లెక్కగట్టి వెనక్కు తీసుకుంటామని చెబుతారు. కానీ గ్రహస్థితి బాగులేక అమ్మడానికి వెళ్తే.. అందులో 72 శాతం కూడా బంగారం లేదని, ఆ మేరకు మాత్రమే లెక్క కడతామని చెబుతారు. బీఐఎస్ హాల్‌మార్క్ ఉంటే 92 శాతం బంగారం ఉంటుందనే గ్యారెంటీ ఇచ్చినట్లు లెక్క. ఈ ముద్ర ఉన్న తర్వాత కూడా బంగారాన్ని కరిగిస్తే 80 శాతం కూడా రావడంలేదని తేలిన సందర్భాలు కోకొల్లలు. అందుకే బంగారం బిస్కెట్లు అమ్మే షాపులు తక్కువగా ఉంటే.. ఆభరణాలు అమ్మే షాపులు మాత్రం పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నరసన్నపేటలో బీఐఎస్ అధికారుల దాడుల వల్ల ఈ వ్యవహారం బయటపడింది కానీ ప్రతిచోటా ఇదే జరుగుతోంది.



## సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




పాత శ్రీకాకుళం సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో ఆషాడమాసం ఆఖరి శుక్రవా రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు తెల్లవారుజామున సుప్రభాతం, క్షీరాభిషేకం, విశేష పుష్పాలంకరణ, శ్రీ సూక్తం విధానముగ షోడశోపచార సహిత సహస్ర నామార్చన, కుంకుమ పూజ, అమ్మవారి జపం, అష్టోత్తర శతనామార్చన కుంకుమ పూజ, శ్రీ దేవీ ఖడ్గమాలతో కుంకుమ పూజ, ప్రత్యేక పూజలు, అర్చనలు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అదే విధంగా విశేష అర్చనలు, నీరాజనం మంత్రపుష్పము, మహా హారతి, వేద ఆశీర్వచనాలు ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారిణి మునగ వలస సుకన్య తదితరులున్నారు.

## ట్రిపుల్ ఐటీలో తొలి క్యాంపస్ డ్రైవ్ విజయవంతం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్లలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) తమ క్యాంపస్‌లో మొట్టమొదటి సారిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించింది. హైదరాబాద్‌కు చెందిన మియామి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ డ్రైవ్‌ను నిర్వహించగా సుమారు 180మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ “ఐఐఐటీ స్థాపించిన తొలినాళ్లలో ఇంజనీరింగ్ విద్యార్థులకు నూజివీడులో తరగతులు నిర్వహించేవారన్నారు. అందుకే ఇప్పటి వరకు క్యాంపస్ డ్రైవ్‌లన్నీ అక్కడే జరిగాయన్నారు. ఇప్పుడు ఎచ్చెర్ల క్యాంపస్‌లోనే అన్ని ఇంజనీరింగ్ పీఈయూసీ, క్లాస్‌వర్క్‌లు జరుగుతున్నాయని, ఇక్కడ క్యాంపస్ డ్రైవ్ జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషమన్నారు. ఈ ప్రాంతంలోని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రశంసిస్తూ, రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని అవకాశాలు వస్తాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఐఐటీ ప్రతినిధులు ముని రామకృష్ణ, శివ రామకృష్ణ, వాసు, రవి గేదెల, రమేశ్, వరప్రసాద్, మియామి టెక్నాలజీస్ ప్రతినిధులు నవీన్, రవిరామ్‌వర్మ, వాగ్దేవి, ప్రహర్సిత్‌లు పాల్గొన్నారు.




## పాత పెన్షన్ మంజూరు చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డీఎస్సీ-2003 ఫోరం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు, అర్హత గల ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 అనుసరించి పాత పెన్షన్‌ను వర్తింపు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు కుటుంబసమేతంగా నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తిలు మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, అదేవిధంగా సెప్టెంబర్ 1, 2004కు ముందే నోటిఫికేషన్ విడుదలై ప్రభుత్వ విధానం వలన పోస్టింగులు ఆలస్యమైన ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం మెమో-57 ప్రకారం పాతపెన్షన్‌ను తక్షణమే వర్తింపజేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి, రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీనివాసరావు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, తమ్మినేని ఆనందరావు, సత్యనారాయణ, పప్పల రాజశేఖర్, కరిమి రాజేశ్వరరావు, గండేపల్లి మల్లేశ్వరరావు, సోమేశ్వరరావు, సీర రమేశ్, పడాల ప్రతాప్, శారద, పంచది గోవిందరావు, జి.భాస్కరరావు, జి.చిన్నకృష్ణంనాయుడు, డి.శివరాంప్రసాద్, కే.ప్రకాష్, పి.శ్రీకర్, ఎ.లక్ష్మణ్, ఎ.తిరుమలేశ్వర్రావ్, టార్జాన్‌బాబు, రామకృష్ణ, అనిల్‌బాబు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలే నా “బలం, బలగం”



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ప్రజలే తన బలం, బలగమని, తాను అందరివాడినని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా నగరంలో దమ్మల వీధి, గుడి వీధి, చంపగళ్ళ వీధి, ఎచ్చెర్ల వీధి, కస్పా వీధులలో పర్యటించి, ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను వివరిస్తూ, తల్లికి వందనం నిధులు అందాయో, లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తనను అభిమానించే ప్రజలు, కార్యకర్తల కోసం, నిర్విరామంగా పని చేస్తానని, తనను నమ్మి ఎమ్మెల్యే స్థానంలో నిలబెట్టిన ప్రజలకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ కార్యకర్తకు, ప్రజలకు, వారు, వీరు అనే తేడా లేకుండా, పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ అందుబాటులో ఉంటూ, సమస్య పరిష్కారాన్ని సుగమనం చేస్తానన్నారు. శ్రీకాకుళం ప్రజలంతా తన కుటుంబ సభ్యులనే విషయం మరిచిపోవద్దని, తాను మీ కుటుంబంలో ఒకరినని, కూటమి ప్రభుత్వం అందరి ప్రభుత్వమని, ఎక్కడ కష్టముంటే, అక్కడ తానుంటానని హామీనిచ్చారు. సుపరిపాలన తొలిఅడుగు ఒక మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లు ఆచరణలో పెట్టారన్నారు. నేరుగా ప్రజలవద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకొని, కొన్ని సమస్యలను సత్వరమే పరిష్కరించగలుగుతున్నామన్నారు. సుపరిపాలన ఒక్క టీడీపీ తోనే సాధ్యమని, కూటమిప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నగర అధ్యక్ష బృందం, వార్డు ఇన్చార్జ్‌లు, టీడీపీ, ఇతర నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడండి

(సత్యంన్యూస్, పొందూరు)

మండలంలో తొమ్మిది మోడల్ ప్రైమరీ పాఠశాలలల్లో 45 లోపు విద్యార్థుల సంఖ్య ఉండడం శోచనీయమని శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ పాఠశాలల్లో నిబంధనల మేరకు కచ్చితంగా కనీసం 45మంది విద్యార్థుల సంఖ్య ఉండాలన్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యా ప్రమాణాలను పెంచేందుకు సమైక్యంగా కృషిచేయాలని, నైతిక విలువలను పెంపొందించేందుకు గాను విద్యార్థులలో గుణాత్మకమైన మార్పులు తీసుకొనిరావాలని విజయకుమారి కోరారు. స్థానిక రెండో నెంబర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించినట్టు ఎం.ఇ.వోలు జి.శ్రీరాములు, పి.రాజారావు డిప్యూటీ ఈవోకు నివేదించారు. అలాగే మూడో నెంబర్ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను నాలుగో నెంబర్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసినట్టు పేర్కొన్నారు. చివరిగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డిప్యూటీ ఈవో సందర్శించారు. సిలబస్, కిట్ల పంపిణీ విద్యార్థుల నమోదులు తదితర అంశాలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.వాగ్దేవితో చర్చించారు.





గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతి రాజును శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులతో కలిసి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, విజయనగరం



బలగ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో గల మురుగు కాలువల వద్ద బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## అపరిచిత వ్యక్తులతో పరిచయం వద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అపరిచిత వ్యక్తులతో పరిచయం వద్దని, సెల్‌ఫోన్ వాడకం వద్దని, మాదక ద్రవ్యాలైన గంజాయి, సిగిరెట్ తదితర వాటికి దూరంగా ఉండాలని రెండవ పట్టణ ఎస్సై ఐ.రామారావు కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం ఠాగూర్ స్కూల్‌లో నిర్వహించిన నారీశక్తి కార్యక్రమంలో మాట్లాడారు. కొత్త వ్యక్తులతో పరిచయం వలన తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. విద్యార్థినిలు తమను ఎవరైనా వెంబడిస్తున్నట్లు గమనిస్తే 100 లేదా 112 నంబర్లుకి ఫోన్ చేస్తే పోలీస్‌లు హాజరై రక్షణ కల్పిస్తారన్నారు. గంజాయి, సిగరెట్, ఇతర మాదకద్రవ్యాలు వినియోగంచారాదన్నారు. ఎవరైనా వినియోగిస్తున్నట్లు గమనిస్తే 100కు లేదా 112కి ఫోన్ చేయాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సాలిహుండం రవికుమార్, ప్రిన్సిపాల్ బెహర శ్రీదేవి, కరెస్పాండెంట్ సత్తిబాబు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు, కానిస్టేబుల్ అప్పారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.